# రహదారి రక్తసిక్తం

- చంద్రాయన్‌పల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- స్పాట్‌లో ఇద్దరు.. చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి
- మృతులంతా ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు
- దసరా కోసం స్వరాష్ట్రానికి వెళ్తుండగా దుర్ఘటన




ప్రమాదంలో దెబ్బ తిన్న బస్సు, ప్రమాదానికి కారణమైన డీసీఎం

ఇందల్వాయి, అక్టోబర్ 14 : దసరా పండుగను కుటుంబీకులతో కలిసి ఆనందంగా జరుపుకొందామనుకున్న వారి ఆశ అలాగే ఉడిపోయింది. సంతోషంగా స్వగ్రామాలకు బయల్దేరిన వారి ప్రాణాలు రోడ్డుప్రమాదంలో గాలిలో కలిసిపోయాయి. దీంతో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నలుగురి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రాయన్‌పల్లి అటవీ ప్రాంతంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరు దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతులు యూపీకి చెందినవారుగా పోలీసులు గుర్తించారు. ఇందల్వాయి ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ఇందల్వాయి మండలంలోని దగ్గి వైపు నుంచి డిచ్‌పల్లి వైపు వస్తున్న వరి కోత మిషన్ బ్రేక్‌డౌన్ అయి రహదారిపై నిలిచిపోయింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు వెళ్తున్న ఓ బస్సు.. వరి కోత మిషన్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్నవారికి గాయాలయ్యాయి. వెంటనే ఏం జరిగిందో చూడడానికి బస్సులో నుంచి ఎనిమిది మంది కిందికి దిగారు. అదే సమయంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం వీరిలో నలుగురిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని హైవే అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతిచెందిన వారిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బలరాంపూర్ జిల్లాకు చెందిన గణేశ్ (29), దుర్గేశ్ ప్రసాద్ (16), గోరఖ్‌పూర్ జిల్లాకు చెందిన ప్రదీప్ (40), సిద్ధార్థ నగర్‌కు చెందిన జిత్తు (32) ఉన్నారు. దసరా పండుగ కోసం మూడు బస్సుల్లో యూపీకి చెందిన వలస కూలీలు హైదరాబాద్ నుంచి యూపీలోని తమ స్వగ్రామాలకు వెళ్తుండగా.. ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాద స్థలంలో తీవ్రంగా గాయపడిన వారి ఆర్తనాదాలు మిన్నంటాయి. రహదారి రక్తసిక్తంగా మారింది. మృతిచెందిన వారిని చూసి మిగిలిన కూలీలు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రదీప్ సోదరుడు సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. అతివేగంగా వాహనం నడిపి నలుగురి చావుకు కారణమైన డీసీఎం డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి గురైన బస్సుతోపాటు నలుగురిని ఢీకొట్టిన డీసీఎం వాహనాన్ని పోలీసులు డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# గుండెపోటుతో బాలిక మృతి

## కంజర గ్రామంలో విషాదఛాయలు



మైథిలి (ఫైల్)

ఖలీల్‌వాడి (మోపాల్ ), అక్టోబర్ 14 : నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని కంజర గ్రామానికి చెందిన ఏడో తరగతి చదువుతున్న మైథిలి (12 ) గుండెపోటుతో మృతి చెందింది. ఇంతచిన్న వయస్సులో బాలిక మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కంజర గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సాయిలక్ష్మి చిన్న కూతురు మైథిలి స్థానిక గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నది. దసరా సెలవులకు ఇంటికి రాగా.. శుక్రవారం రాత్రి సమయంలో గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు చెప్పడంతో మరో దవాఖానకు తీసుకెళ్లగా..అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు. గ్రామంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

# లైసెన్స్ ఆయుధాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలి

- ఈ నెల 21వ తేదీ లోగా..
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు
- సీపీ కల్మేశ్వర్ సింగెనవార్



నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 14 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో లైసెన్స్ ఆయుధాలు కలిగి ఉన్న ప్రతిఒక్కరూ తమ ఆయుధాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో లైసెన్స్ ఆయుధాలు కలిగి ఉన్న వారు సెక్షన్ 21 ఆఫ్ ఆర్మ్స్ యాక్టు 1959 ప్రకారం సంబంధిత పోలీస్‌స్టేషన్లలో ఈనెల 21వ తేదీలోగా అప్పగించాలని సూచించారు. లైసెన్స్ ఆయుధాలు అప్పగించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా నోటిఫికేషన్ నుంచి మినహాయింపు పొందాలనుకునే వారు జిల్లా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎస్.జయరామ్ (ఆయుధాల స్క్రీనింగ్ కమిటీ)–87126 59777ను సంప్రదించి, రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని సీపీ సూచించారు.

## సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్

# తెలంగాణ జట్టుకు జిల్లా విద్యార్థుల ఎంపిక



జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ తెలంగాణ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 14 : జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ తెలంగాణ జట్టుకు ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.శ్యామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 30 నుంచి ఈనెల 2వ తేదీ వరకు ఆర్మూర్‌లోని అల్ఫోర్స్ నరేంద్ర హైస్కూల్‌లో నిర్వహించిన 42వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానంలో, బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. జిల్లా జట్లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు పండరి, సాయినాథ్, అక్షయ్, సన్నిధి, బి.రుచిత తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు నేటి (ఆదివారం) నుంచి ఈనెల 19వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాయిలో నిర్వహించే 42వ జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు మానస గణేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, సలహాదారుడు హన్మంత్ రెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్ రెడ్డి, మల్లేశ్ గౌడ్, ఉపాధ్యక్షులు కిషన్, కిశోర్, రంజిత్ సింగ్, రాజ్ కుమార్, నర్సయ్య, రాజేశ్వర్, కృష్ణమూర్తి తదితరులు క్రీడాకారులను అభినందించారు.

# లైంగికదాడి కేసులో ఏఆర్ కానిస్టేబుల్ రిమాండ్

ఆర్మూర్, అక్టోబర్14: ఓ మహిళపై లైంగికదాడి కేసులో ఏఆర్ కానిస్టేబుల్ కనికరం నటరాజ్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు తెలిపారు. వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన నటరాజ్.. నిజామాబాద్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈయన ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో నివాసం ఉంటున్నాడు. పెర్కిట్ గ్రామానికి చెందిన ఓ మహిళపై నటరాజ్ లైంగికదాడికి పాల్పడగా.. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెర్కిట్‌లో నటరాజ్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

# లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలోని కోనేరు వద్ద భక్తుల సందడి



స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

**శనివారం అమావాస్య రావడంతో తరలివచ్చిన భక్తులు**

ఎడపల్లి, అక్టోబర్ 14: మండలంలోని జాన్కంపేట్ శివారులో ఉన్న శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. శనివారం అష్టమి, అమావాస్య కలిసి రావడంతో ఆలయ ప్రాంగణంలోని అష్టముఖి కోనేరులో స్నానమాచరించి, ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటే పాపాలు, కష్టాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇందులో భాగంగానే శనివారం అమావాస్య, అష్టమి వచ్చే రోజున ఆలయానికి భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు. ఉదయం నుంచి భక్తుల వేల సంఖ్యలో హాజరయ్యారు. ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అష్టముఖి కోనేరు మధ్యలోకి వెళ్లకుండా కర్రలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. కోనేరు వద్ద ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. భక్తుల క్యూలో తొక్కిసలాట జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాలు, మండలానికి చెందిన వారే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయానికి బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్, రూరల్ సీఐ శ్రీనివాసరాజు దర్శనానికి రాగా.. వారిని ఆలయం తరఫున ఘనంగా సన్మానించారు. ఆలయంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చేసిన ఏర్పాట్లపై ఏసీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయం వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎడపల్లి ఎస్సై విక్రం.. సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. ఆలయంలో కార్యక్రమాలను ఆలయ ఈవో గింజుపల్లి వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు కులకర్ణి, ధర్మకర్తలు పర్యవేక్షించారు.